
శ్రీధర్



# చరిత్రకు చితి

చీకటి కుంభవృష్టిగా కురిసింది.

చీకట్లో కుంభవృష్టి కురిసింది.

తీరా వాన వెళ్ళేవేళకు, చీకటి కోనా వెళ్ళిపోయి, తూరుపు వెలాతెలా బోయింది. షవర్ బాత్ చేసేసి నగ్నంగా నిలబడ్డ భూదేవి ఒంటిని ఎండపొడల తుండుగుడ్డతో తుడుస్తున్నాడు సూర్యుడు.

ఆరయింది, ఏడయింది, ఎనిమిదయింది. లోకంలోని వాళ్ళంతా నిద్రలేచి, మళ్ళీ ఎవరి లోకంలో వాళ్ళు మునిగిపోయ్యారు.

మామిళ్ళవారి వీధిలో చిట్టచివరన ఎడంవైపునఉన్న ఆ కాంపౌండులోకి పట్టపగలైనా ఎవరూ వెళ్లరు. అదంతా చిన్నచిట్టడివిలా ఉంటుంది, చేసేనాధుడు లేక ఇప్పుడిలా అరణ్యంలా అయిపోయిందిగాని, ఆ రోజుల్లో...... పాతికేళ్ళ క్రిందటిమాట...అన్నపూర్ణ ఈ ఆవరణలో ఎంత అందమైన తోటను పెంచిందనీ! తన చేత్తో నాటిన ఫల వృక్షాలు ఎప్పుడెప్పుడు పెద్దవవుతాయా, ఎప్పుడెప్పుడు ఎగిరెగిరి కాయలు కోసుకుంటానా అని ఎంతో అమాయకంగా ఆశపడేది అన్నపూర్ణ. అయితే ఆ తోట వాళ్ల సొంతంకాదు. దాన్ని సొంతం చేసుకోగలనని ఆమె కలలో గూడా

అనుకోలేదు. అనుకోకుండా చిత్రంగా ఆమె ఇంటికీ, తోటకీ యజమాను రాలైంది. అంతకన్నా చిత్రంగా ఆమె ఆ ఇంటికి దూరమైంది.

చాలాకాలం అది పాడుబడిన కొంపలాగే ఉండిపోయింది. ఈ మధ్యనే ఆర్నెల్ల క్రిందట ఆనందరావు మళ్ళీ ఆ ఇంట్లో కాలుపెట్టాడు.

కానీ, ఎంచేతో రాత్రినుంచీ ఆనందరావు మంచంమీదనుంచి కాలు కదపలేకపోతున్నాడు. ఒళ్ళు తన స్వాధీనంలో లేదు. నిస్సహాయంగా పైకప్పుకేసి చూస్తున్నాడు. ఉండుండి కిటికీలు, తలుపులు ఫెడేల్ ఫెడేల్‌మని కొట్టుకుంటున్నయి. గాలీ, వానా కల్సి నానా అల్లరి చేస్తున్నయి.

జల్లుపడి తనమంచం తడిసినందుకూ కాదు, మనిషి తడిసినందుకూ కాదు. ప్రాణప్రదంగా దాచుకున్న డైరీలన్నీ ఆ చెక్కపెట్టెనిండా ఉన్నయి. ఆ చెక్కపెట్టె కిటికీ పక్కనే ఉంది. అది తడిసిపోతోంది. తన ఇన్నేళ్ళ అనుభవాలూ, అనుభూతులూ వాటినిండా ఉన్నయి. ఇంతకుముందే అవెన్నోసార్లు కన్నీటి వానలో మునిగితేలినయి. ఇప్పుడీ వాన జల్లులో తడిసి చెరిగిపోతాయేమో, క్రమంగా చినిగిపోతాయేమో !

ఏం చెయ్యటం చెప్మా ! గొంతెండిపోతోంది. తడుపుకునే శక్తిలేదు. పక్కంతా తడిసిపోతోంది. మంచం పక్కకు జరుపుకునే ఓపికలేదు. రాత్రి పెద్దగా జల్లు కొట్టినప్పుడు మొహం నిండా నీళ్ళు పడ్డయి. నాలిక తడుపుకోవాలని నోరెళ్ళబెట్టాడు. కానీ నీళ్ళు లోపలికి పోనూలేదు, దాహం తీరనూ లేదు.

మంచంలోనుంచి తను ఇంక లేవలేదు. నలుగురూ కల్సి తనను లేపుకుపొయ్యే సమయం ఆసన్నమవుతోంది. కానీ, తనకెవరున్నారు? చుట్టూ ఉన్న ఈ చిట్టడివిలాంటి తోటలోకి ఎప్పుడూ ఎవరూ రారు. ఇంక ఈఇంట్లో కొచ్చి, తన ఒంట్లోని శక్తిసామర్థ్యాలను పరికించే దిక్కెక్కడ ?

పద్మజ కోసం ఆనందరావు కళ్ళు ఆశగా చూస్తున్నవి. గొంతెత్తి పిలవాలని ఉన్నా, ఆ పిలుపు తనకే వినిపించటం లేదు అసలు పద్మజ ఇంట్లో లేదా ?

లేదు నిన్నటినుంచి ఎక్కడా ఎవరూ కదిలిన అలికిడే లేదు, జాలి దలచినగాలి, పొద్దున్నే కసువు చిమ్మేసి వెళ్తే, కరుణించిన వరుణదేవుడు కలాపినీళ్ళు చల్లాడు. ఆ ఇంటి చరిత్ర అంతా ఎరిగున్న పున్నాగచెట్టు, వానకు తడిసిన నాలుగు పూలను గుమ్మం ముందు రాల్చింది. కడివెడు కన్నీళ్ళతోపాటుగా. ఈ గాలి, ఈవాన, ఈ పూలు ఆ ఇంటికి కొత్తవికావు. తరచూ వచ్చి వెళ్లేచుట్టాలే. నోరులేని ఈ ప్రకృతి ప్రతిస్పందన తప్పితే, ఇవాళ ఆనందరావు హృదయ స్పందన ఎవరికీ అక్కర్లేదు.

ఆనందంగా బ్రతకటానికి అన్ని అవకాశాలూ ఉండీ, పడరాని అవస్థలు పడే పరమమూర్ఖులు కొంతమంది ఉంటారు. వాళ్ళమీద ఎవరూ జాలి పడరు. ఆనందరావు 'జీవితం ఒక టెక్నికలర్ కల' అని పాతికేళ్ళ క్రిందట ఒకనాడు తన డైరీలోని ఒక పేజీలో రాసుకున్నాడు.


'దురదృష్టపు సైకత తీరంవద్ద నిస్సహాయంగా చూస్తూ నిలబడ్డ తనను, అదృష్టమనే ఉత్తుంగ తరంగం వచ్చి చుట్టేసి, తన విచక్షణా జ్ఞానాన్ని, వివేకాన్ని ముంచెత్తేసి, కళ్లు మూసేసి, కాళ్ళక్రింద కోసేసి, ఉక్కిరి బిక్కిరి చేసి ఎక్కడికో లాక్కుపోయి, తిక్క కుదిరినాక, తెచ్చి ఇక్కడ పారేసింది' అని పాతిక రోజుల క్రిందట తన డైరీలో రాసుకున్నాడు ఆనందరావు.

రెండూ నిజాలే. ఆనందరావు చాలా నిక్కచ్చిఅయిన మనిషి. నిప్పులాంటి వాడు. ఇంకా నిప్పయినా నీటికి లొంగుతుందేమోగాని, ఆనందరావు మాత్రం ఎవరికీ లొంగే మనిషికాదు. తన హద్దులు తానెరిగి, ఆ పరిధిలో పవిత్రంగా బ్రతకాలనుకుని బ్రతుకును పాడుచేసుకున్న చిత్రమైనవ్యక్తి. మనిషి మంచివాడు. ద్రోహచింతన లేదు. ఎవరైనా తనకు ద్రోహం తలపెడితే, వాళ్ళను అసహ్యించుకునేవాడు, వాడెంతటివాడైనా సరే. బంధువులూ, స్నేహితులపట్లనేగాక, పై అధికార్లతో సయితం ఇలాగే ప్రవర్తించేవాడు.

ఆనందరావుకు పలాయనవాదం పనికిరాదు కర్తవ్యం, బాధ్యతలపట్ల పట్టు విడుపులు తెలియవు. అవి తెలియనందువల్లనే ప్రతిచిన్నవిషయానికీ ప్రతివాళ్ళతో ఘర్షణపడాల్సి వచ్చేది. తన అభిప్రాయం సరైనదేనని తన తప్పేమీ లేదనీ సరిపుచ్చుకునేవాడే గాని, ఎదటివాడిని మంచి చేసుకునే ప్రయత్నం చేసేవాడు కాదు.

ఓర్పుగా చేస్తున్నాడుగదాని నలుగురి పని ఇతనికి ఒక్కడికే అప్పగించాడు పై ఆఫీసరు. సహనం వహించాడు ఆనందరావు. అయినా ఏవో తప్పులు వెతికి దండించటం మొదలుపెట్టాడు. ఆనందరావు ఎదురు తిరిగాడు. ఇతన్ని తొక్కిపెట్టి తన కులంవాడికి ప్రమోషన్ ఇవ్వటంతో ఆనందరావు బహిరంగంగానే ఆఫీసర్ని నిందించటం మొదలుపెట్టాడు. దానితో ఆఫీసులో ఆనందరావు అందరికీ బరువైపొయ్యాడు. ప్యూను గూడా పలకటం మానేశాడు. అయినా ఆనందరావు తన తప్పేమీ లేదనే నిర్ణయించుకున్నాడు. ఆత్మవిమర్శ చేసుకుంటూ, తన డైరీలో రాసుకుంటూ.

తనకు దొరికిన బంధువులంతా రాబందులేనని తెల్సుకున్నాడు. అంచేత




ఎవర్నీ చేరనిచ్చేవాడుకాదు. వాళ్ళకై వాళ్ళు ఎవరైనా ఇల్లు వెతుక్కుంటూ వచ్చినా, వాళ్ళు వెళ్ళేదాకా ముళ్ళమీద కూర్చున్నట్లే ఉండేది. వీలైనంత ముక్తసరిగా మాట్లాడి, ముక్తాయింపు ఇచ్చి పంపేవాడు. ఇక స్నేహితుడనబడే వాడెవడూ ఆనందరావుకు లేడు. ఎవడైనా, ఎప్పుడేనా హస్కులోకి దింపినా, ఆ కార్యక్రమానికి ఎప్పుడు జనగణమన పాడేసి పారిపోదామా అని కాచుకుని కూర్చునేవాడు.

అంచేత ఆనందరావుకు ఆప్తులు లేరు. అయినవాళ్ళు, ఆప్తులు లేకపోతే పీడా పోయిరి, తొండ ముదిరి ఊసరవెల్లి అయిందని, చివరకు పెళ్ళాం పిల్లల తోనూ అదే పద్ధతిలోకి దిగాడు.

నిత్యం తన రుచులూ, అభిరుచులూ ఆమె నెత్తిన రుద్ది తలంటి పోసేవాడు. ఆమె నోరెత్తితే అతను మరీ రెచ్చిపొయ్యే వాడు. 'మగాడు చెప్పాలి, ఆడది వినాలి, దట్సాల్' అనేవాడు సుప్రీంకోర్టు ఫుల్ బెంచి జడ్జిమెంటులా.

"మరయితే దేవుడు ఆడదానికి నోరెందు కిచ్చాడు ?" అని ఎదురు తిరిగి అడిగేది అన్నపూర్ణ, సహనం చచ్చిపోయిన పూట.

"మమ్మల్ని మింగటానికే" అని అరిచేవాడు ఆనందరావు. అలా అన్నాడు గదాని, చూస్తూ చూస్తూ భర్తను మింగి నాధుడు లేని అనాధగా మిగల్లేనందువల్ల, తన దుఃఖాన్ని తనే దిగమింగుకునేది అన్నపూర్ణ. ఒంటరిగా ఉన్నప్పుడు కళ్ళు వాచిపొయ్యేటట్లు ఏడ్చేది.

ఎందు కేడ్చావని అతను అడిగేవాడు కాదు. తన శక్తిమేరకు భార్యకు సుఖ సంతోషాలను ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నాననీ, అయితే తన కష్టాల్లో భాగం పంచుకోవాల్సిన బాధ్యత గూడా ఆమె కుందనీ, అంచేత మనస్ఫూర్తిగా తనతో సహకరించకపోతే, ఆ లోపం ఆమెదేననీ తన డైరీల్లో రాసుకునే వాడు ఆనందరావు. అతను లేనప్పుడు అవన్నీ చదివి, ఎంత చక్కగా తనను తాను సమర్థించుకుంటా డీయన— అని విస్తుపొయ్యేది అన్నపూర్ణ.

చిన్నకుటుంబమే అయినా చింతలకు నిలయమైంది వాళ్ళ సంసారం. సరిగ్గా జీతంతెస్తే, అతని సంపాదన మొగుడూ పెళ్ళానికీ, ఉన్న ఒక్కగానొక్క కొడుక్కీ చాలకపోదు. అందునా కాఫీ, సిగరెట్టులాంటి (దుర) అలవాట్లకు గూడా ఆమడదూరంలో ఉండే ఆనందరావుకు, డబ్బు ఇబ్బందేమిటి ? ఇంట్లో వెచ్చాలకీ, బియ్యానికీ కరువేమిటి ? షాపువాడి బాకీ తీరక, వాడు అరువు ఇవ్వకపోవటమేమిటి ? జీతం ఏమైందని అడిగితే, రెండు నెలల నుంచీ జీతం రాలేదన్నాడు. ఆశ్చర్య పోయింది అన్నపూర్ణ. ఆఫీసుకు వెడుతున్నా, తన భర్తకి ఒక్కడికే ఎందుకు జీతంరాదో ఆమెకు ఎంతకీ అర్థమవదు. తనను ఏడిపించటానికి ఆఫీసులో అంతా ఏకమై అలా చేస్తున్నారని చెప్పాడు.

డైరీ తీసి చదువుకుంది అన్నపూర్ణ. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, నీతికీ, నిజాయితీకి నిలువ నీడదొరకదనీ, ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా తను ఆఫీసర్ను క్షమాపణ వేడుకునే ప్రశ్నేలేదనీ రాసుకున్నాడు.

మర్నాడు వాచీ అమ్మాడు. వారం రోజుల తర్వాత సైకిలు అమ్మాడు. ఇరవైరోజుల తర్వాత పెళ్ళాం మెళ్ళో గొలుసు అమ్మాడు. ఇంక పెళ్ళాన్ని అమ్మేరోజు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసింది అన్నపూర్ణ. తప్పేముంది. పురాణపురుషు లేనాడో దారి చూపించారు గదా. హరిశ్చంద్రుడిలాగా ఈయనా, తననీ, పిల్లాణ్ణి పెద్ద బజార్లో నుంచో బెట్టి, 'జవదాటి ఎరుగదీ యువతీలలామ' అని పద్యం పాడతాడేమో. ఏమో మరి, ఈమధ్య గడ్డం గూడా పెంచుతున్నాడని భయపడింది అన్నపూర్ణ.

ఒకనాడు ఏవో ఇంట్లోకి కావల్సినవి బజారునుంచి తెచ్చుకుంటూ ఉంటే, ఒక లాటరీ టిక్కెట్లు అమ్మేవాడు తన వాక్చాతుర్యంతో ఆమెను ప్రలోభ పెట్టాడు. ఉన్న ఒక్క రూపాయి ఎలాగూ తన దరిద్రాన్ని తీర్చలేదుగదాని ఒక టిక్కెట్టు కొన్నది అన్నపూర్ణ. డ్రా అయిన మర్నాడు ఆ టిక్కెట్టు భర్త చేతికిచ్చి 'ఏమన్నా తగిలిందేమో' చూడమంది. 'అది కొన్నందుకు నీకు తగలాలి తన్నులు' అని విసుక్కున్నాడు.

ఈ జూదాలు మూలంగా పాండవుల దగ్గరనుంచీ పాకీవాడిదాకా పడరాని పాట్లు పడ్డారని సవివరంగా వర్ణిస్తూ, పరవస్తు చిన్నయసూరి లెవల్‌లో ఒక నీతిచంద్రికను వల్లించాడు. పోగొట్టుకున్న రూపాయితో అవసరమైనవి ఏవేం కొనుక్కోవచ్చో వివరించాడు.

అయిష్టంగానే లాటరీ టిక్కెట్టును జేబులో పెట్టుకుని బజార్లోకి వెళ్ళి పేపరు తిరగేసిన ఆనందరావు కళ్ళు బైర్లు కమ్మాయి. తన ఇంద్రియాలు తనను మోసం చేస్తున్నాయేమోనని ముందు అనుమానపడ్డాడు. ఒకటికి పదిసార్లు చూసుకుని, మొదటి బహుమతి మూడు లక్షలూ తనదేనని తేల్చుకుని ఇంటికి వచ్చాడు.

ఇన్నాళ్లకు భర్త ముహంమీద చవితి నాటి చంద్రుడిలా రేఖామాత్రంగా చిరునవ్వు వెల్లివిరియటం చూసి అన్నపూర్ణ మామూలుగానే విస్తుపోయింది. 'మూడు లక్షలు ఫస్ట్ ప్రైజు మనకే' అనగానే నోట మాటరాక నివ్వెరపోయింది. సంతోషం పట్టలేక ఆనందరావు అన్నపూర్ణను కౌగలించుకుని ముద్దెట్టేసుకున్నాడు. పట్టపగలు హద్దు మీరిన సరసాన్ని కిటికీలోనుంచి చూసిన విశాలాక్షి బుగ్గలు నొక్కుకుంది. పక్కవాటాలోఉన్న విశాలాక్షి ఈ వార్తను ప్రత్యేక ప్రసారం గావించింది.

మూడు లక్షలూ చేతిలో పడగానే, భార్యను ఏం కావాలో కోరుకోమన్నాడు ఆనందరావు. తను ప్రాణాధికంగా పెంచుకున్న ఆ తోట తనకు కావాలన్నది. ఇంకేం, ఆ రోజుల్లోనే ముప్ఫయివేలకు బేరమాడి కొనేశాడు. ఆ కొనటంలో ఆనందరావు ఇల్లు తన పేరనే కొనుక్కున్నాడు

తెప్పలుగ చెరువు నిండిన, కప్పలకు కొదవా ? వానా కాలం రెక్కపురుగుల్లా, ఎక్కడినుంచి పుట్టుకొచ్చారో, తండలు తండలుగా చుట్టాలు వచ్చి దిగటం మొదలెట్టారు. ఆనందరావును ఇంద్రుడు అన్నారు కాదు, లోకానికి వెలుగునిచ్చే చంద్రుడన్నారు. పైకి పొగుడుతూనే, లోలోపల గోతులు తవ్వటం మొదలు పెట్టారు. అన్నపూర్ణ పుట్టింటి వారమంటూ వచ్చిన వాళ్ళంతా ఆమెకు నూరిపోసిన దొక్కటే.

లాటరీ తనకు వస్తే, డబ్బంతా మొగుడికి అప్పజెప్పి, తను ఎప్పట్లా పప్పురుబ్బుతూ కూర్చున్నందుకు, అన్నపూర్ణ మీద సానుభూతి కురిపించేశారు. ఆమె మనసు మార్చేశారు. అన్నపూర్ణ భర్తను పోరటం మొదలు పెట్టింది. అతను డబ్బు ఎవరిదగ్గర ఉంటేనేం ఉంటాడు. ఎవరి దగ్గర ఉన్నా ఒక్కటే అయినప్పుడు తనదగ్గరే ఉండవచ్చుగదా అంటుంది అన్నపూర్ణ

ఇన్నాళ్ళూ ఇంటి పెత్తనం తనే చేశాడుగాబట్టి, ఇకముందు కూడా తనే చెయ్యాలన్నాడు ఆనందరావు. ఇప్పుడే ఇలా ఉంటే, ఆ కాస్త హారతి పట్టేశాక ఆమెకు మిగిలేదేమిటని అన్నపూర్ణను వెనకేసుకొచ్చింది ఆమె పినతల్లి.

ఎలాగయితేనేం, తలా ఒక సమిధను వేసి, మొగుడూ పెళ్ళాల మధ్య అగ్ని గుండం రగిల్చారు. డబ్బు ఎలా ఇవ్వడో చూద్దామని మగవారంటే, తామంతా ఉండగా, అన్నపూర్ణ కొచ్చిన కొదవేమీ లేదని ఆడంగులంతా అన్నారు. పర్యవసానాల గురించి అన్నపూర్ణను ఆలోచించుకోనివ్వకుండా, ఆమెను ఆ ఇంట్లోనుంచి లాక్కుపోయి, ప్లీడరు నోటీసు ఇప్పించారు.

దాంతో అన్నపూర్ణకీ, ఆనందరావుకీ అనుబంధం తెగిపోయింది. తన డైరీలో ఇలా రాసుకున్నాడు.

'ఎవరి స్వార్థం గురించి వాళ్ళు ఆలోచించుకోవటం వ్యాపార సరళి. సంసారం వ్యాపారం కాదు. ఇంట్లోఉన్న నలుగురూ ఒకరి బాగోగులకోసం మరొకరు పాటుబడటమే సంసార ధర్మం. ఈ ధర్మం అన్నపూర్ణకి తెలియక కాదు. తెల్సి లోకుల మాటల కిచ్చిన విలువ నా మాటకు ఇవ్వలేదు. ఇదీ అసలు సమస్య. ఇద్దరం విడిపోవటానికి కారణం డబ్బు కాదు. చెప్పుడు మాటలు విని, కాపరాన్ని కూలదోసుకునే దుర్బలత్వం ఆమె కున్నప్పుడు, ఈ కలిమిలోనే కాదు, కష్టాల్లోనూ తనను కాదని వెళ్ళిఉండేదే.'

ఆనందరావు ఆలోచనలన్నీ వింతగా ఉంటయి. అయితే అతను ఎవరితోనూ నోరువిప్పి ఏమీ చెప్పడు. తన డైరీలతో మాత్రమే తను మనసు విప్పి చెప్పుకుంటాడు. ఆ డైరీలను చదివి, భర్తను అర్థం చేసుకోవటానికి, అన్నపూర్ణఇప్పుడతనికి చాలా దూరంగా ఉంది.

కోర్టుకు వెళ్తానని బెదిరించటంతో ఆనందరావు, అన్నపూర్ణపైన వైరం పెంచుకున్నాడు. ఆ ఇల్లు, ఆ ఊరు, ఆ పరిసరాలు విడిచి దూరంగా వెళ్ళిపోవాలనుకున్నాడు. తిరిగి తిరిగి విసుగు చెందాడు.

ప్రపంచంలో ఎన్ని చోట్ల తిరిగినా, ఎంత డబ్బు ఖర్చుపెట్టినా స్వంత ఇల్లు, స్వంత మనిషి ఇచ్చే హాయినీ, తృప్తినీ బయటపొందాలని వెంపర్లాడటం మరీచికలవెంట పరుగులెట్టటమేనని తన డైరీలో రాసుకున్నాడు. అన్నపూర్ణకు మొదట్లో తనమీద పెద్దగా ద్వేషంలేదు. చిన్నచిన్న అభిప్రాయ భేదాలుంటే ఉండవచ్చు. కానీ చుట్టమైవచ్చి దయ్యమై పట్టినట్టుగానే, ఆమె బంధువులంతా, ఆమె మనసు విరిచేశారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినయి. ఫలితంగా తమ సంసారం విచ్ఛిన్నమైపోయింది.

ఏడాది దాటిపోయింది. ఇప్పుడు

అన్నపూర్ణ సంగతి ఆనందరావుకు గుర్తు లేదు. కొత్తప్రదేశంలో కొత్త జీవితం ప్రారంభించాడు. ఇక్కడ స్థిరపడే సమయానికి చేతిలో రెండు లక్షలు మాత్రమే మిగిలాయి. కూర్చుని తింటే కొండలయినా కరిగిపోతాయి గదా. లక్ష అంటే ఎంత, రెండక్షరాలు ఖర్చు పెట్టదల్చుకుంటే ఎంత సేపు ? ఒకరోజు రేసులో పెడితే, సాయంత్రానికి భిక్షాధికారి కావచ్చు. లేదా మరో రెండు లక్షలకు అధికారి కావచ్చు.

అన్నట్లు ఆనందరావు ఆలోచనల్లో అతనికి తెలియకుండానే ఊహించలేనంత మార్పువచ్చింది. పూర్వం డబ్బున్న వాళ్ళంతా బీదవాళ్లను పట్టిపీడించేజలగల్లా కనిపించేవాళ్లు. ఇప్పుడు లేనివాళ్లంతా ఉన్నవాళ్లనుకొల్లగొట్టిలొల్లుకుతిందామనే ఆశపోతులుగా కనిపిస్తున్నారు.


ఒకడి చేతిక్రింద పనిచేసే ప్రసక్తి లేదుగాబట్టి, తనే స్వంతంగా వ్యాపారం చెయ్యాలి. ఏ వ్యాపారం లాభసాటిగా ఉంటుందా అని ఆర్నెల్లు సతమతమై, చివరకు మంచి సెంటరుచూసి బట్టల దుకాణం పెట్టాడు. ఈ బట్టల దుకాణంలోనే ఆనందరావుకు రజియా పరిచయమైంది. తనకు నచ్చిన చీర కొనుక్కోవటానికి అయిదు రూపాయలు తక్కువైనాయని ఆమె బాధపడితే, జాలిపడి ఆమె కోసం రేటు తగ్గించి ఇచ్చాడు ఆనందరావు. నెలరోజుల తర్వాత అతను ఇచ్చిన చీరకట్టుకుని మళ్ళీ అదే షాపుకు షాపింగ్‌కు వచ్చింది. పూర్వ పరిచయాన్ని గుర్తుచేసి, మరింత సన్నిహితంగా వచ్చింది. అక్కడి నుంచి రాకపోకలు ఆరంభమైనయి. క్రమంగా ఆనందరావు బట్టల దుకాణంలోని ఖరీదైన చీరలు రజియా పడకగదిలోకి నడిచివెళ్లాయి.


రజియాకి చీరలంటే మహాపిచ్చి. కొత్తచీర పట్టుకెళ్ళి ఇచ్చినప్పుడల్లా, ఆ అన్నులమిన్న కన్నులవెలిగే వెన్నెల వర్ణనాతీతమని, ఆనందరావు తన డైరీలో వర్ణించుకున్నాడు. రజియా బొద్దుగా ఉంటుంది. ముస్లిం యువతిఅయినా, పుట్టి పెరిగింది ఆంధ్రాలోనే కాబట్టి, తెలుగు దానిలాగే ఉంటుంది. తెలివిగలదానిలాగే కనిపిస్తుంది.

రజియా చాలా తక్కువగా మాట్లాడుతుంది. ముభావంగా మసులుతుంటుంది. కలెక్టరాఫీసులో టైపిస్టుగా చేస్తూ ఒక్కతే ఉంటోంది. చాలా దూరంలో తల్లిదండ్రులు ఉన్నారని ఆనందరావుకు చెప్పింది. ఎందుకో ఎప్పుడూ దిగులుగా, జీవితంలో అన్నీ పోగొట్టుకున్న విరాగినిలా, ఈ మాయమోహ సమన్వితమైన లోకాన్ని చూసి జాలిపడుతున్న జ్ఞానిలా ఉండేది. ఒంటరిగా కూర్చుని నింగివంక చూస్తూ పావుగంటకోసారి ఆలోచనకీ ఆలోచనకీ మధ్య దొరికిన విరామంలో దీర్ఘంగా నిట్టూర్చేది.

ఇదంతా గమనించిన ఆనందరావు ఆమె జీవితాన్ని శోభాయమానం చేయదల్చుకున్నానని చెప్పినప్పుడు అవుననీ అనలేదు, కాదనీఅనలేదు. అతని మాటలు వినిపించనట్లు పరధ్యానంగా ఉండిపోయింది.

ఆర్నెల్ల తర్వాత ఓ రోజు రాత్రి ఆనందరావు ఛాతీమీద తలవాల్చిపడుకుని అతని హృదయంతో గుసగుసలాడింది






తన కిప్పుడు మూడోనెల అని. ఆనందరావు ఆనందించాడు అంత సంతోషంలోనూ రజియా ముహ మండలంమీద తాండవ మాడుతున్న నైరాశ్యాన్ని అతను గుర్తించకపోలేదు. కారణం చెప్పమని ఎంత గుచ్చి అడిగినా ఆమె చెప్పలేదు. ఎంతో అవసరమైతే తప్ప ఆమె నోరు విప్పదు.

అర్ధరాత్రి నిద్ర మెలుకువ వచ్చి చూస్తే రజియా కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది. ఎంత లాలించి అడిగినా ఆమె కారణం చెప్పలేదు. తన బిడ్డ భవిష్యత్తు గురించి బెంగపడుతున్నానని మాత్రం చెప్పింది.

రజియా సంతోషంకోసం ఆనందరావు డబ్బు మంచినీళ్లప్రాయంగా ఖర్చు పెట్టాడు. లేడీ డాక్టరు ఆనందరావుతో రహస్యంగా చెప్పింది, ఆమె దేనికో మానసికంగా అమితంగా బాధపడుతోందని, ఆమె కోలుకోనిదే మందులవారి మందులదేనని హెచ్చరించింది. రజియా మనస్తాపానికి తగినమందు ఆనందరావుకు దొరకలేదు. ఆమె గత చరిత్ర తెల్సుకోవాలని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. అవన్నీ మర్చిపోమని ఆనందరావు వేడుకున్నప్పుడల్లా, రజియా నిర్లక్ష్యంగా నవ్వేది. గాఢ నిశీధిలో రాలిపోతున్న నక్షత్రం క్షణంసేపు గీసిన వెలుగురేఖలా తోచేది ఆ నవ్వు. మళ్ళీ మామూలుగా తన నైరాశ్యాన్ని ముసుగువేసుకునేది.

రజియా అనే అర్థంకాని పజిల్‌తో ఆనందరావు బుర్ర బద్దలుకొట్టుకున్నాడు. సమస్యకు పరిష్కారం మాత్రం అతనికి దొరకలేదు. కాగల కార్యం గంధర్వులే చేస్తారుట. ఆ పీటముడిని కాలమే విడదీసింది.

ప్రైవేటు నర్సింగ్‌హోంలో రజియా పురుడు పోసుకుంది. సిజేరియన్ ఆపరేషను చేయవల్సి వచ్చింది. అయినా తట్టుకుని నిలబడింది. గండం గడిచింది కదాని తృప్తిపడ్డాడు ఆనందరావు. ఇకనైనా రజియా ప్రవర్తనలో మార్పు వస్తుందనుకున్న ఆనందరావుకు నిరాశే ఎదురైంది. పిల్లను పక్కలో పెట్టుకుని, వెల్లువలా పెల్లుబుకుతున్న దుఃఖాన్ని ఆపలేకపోయింది. ఆనకట్ట కట్టలేకపోయింది. పిల్ల కళ్ళు తెరచిన మూడో నాడు, తల్లి కన్నుమూసింది.


ఆనందరావు చుట్టూ పట్టపగలే చిమ్మ చీకటి కమ్మేసింది. ఈ పసిగుడ్డు ఆలనా పాలనా అతనేం చూడగలడు ? కొద్ది రోజులు మాత్రం ఆ పిల్లను తన దగ్గరే పెట్టుకున్నాడు. డబ్బు సమస్య లేదు గాబట్టి, ఏ పనిమనిషినో పెట్టుకుని పిల్లను పెంచి పెద్దచేయవచ్చు. కానీ తను అంత శ్రమదమాదులకోర్చి దీనిని తీర్చిదిద్దవల్సిన అవసరం ఎంతవరకు ఉందీ అన్నప్రశ్న ఎదురైంది.

రజియా తనకు ఎంత దగ్గరగా వచ్చినా, ఎంతో దూరంగానే ఉంటూ వచ్చింది. మనిషి తన కోసమే బ్రతుకుతున్నట్లు మాట్లాడేది. కానీ తనకు మనసు విప్పి చెప్పుకున్న సందర్భాలేవీ లేకపోగా తన సాన్నిధ్యంలో గూడా దేనికో తెలియని మానసిక క్షోభను అనుభవిస్తున్నట్లు కనిపించేది. అందుకు కారణాలు తనకేమీ కనిపించేవి కావు. ఎంత కోరినా ఆమె రహస్యాలేవీ అతనికి వినిపించేది కాదు. ఆ విధంగా వాళ్ళ సంబంధం అంతంతమాత్రంగానే ఉండిపోయింది–అని డైరీలోని మరో పేజీతో మొరపెట్టుకున్నాడు.

అంచేత ఈ పసిగుడ్డుతో ఈ రొంపిలో కూరుకుపోవాల్సిన అవసరం ఏంలేదని సర్ది చెప్పుకున్నాడు ఆనందరావు. ఓ అనాథశరణాలయానికి కొంత చందా ఇచ్చి, ఈ పిల్లను జాగ్రత్తగా చూడమని వాళ్ళకు అప్పగించాడు. ఎంత శ్రద్ధగా చూసినా అనాథ శరణాలయం స్వంత ఇల్లుకాలేదు. ఈపిల్ల పెరిగి పెద్దదయినాక తన తండ్రి ఉండీ కావాలనే ఆ అనాథ శరణాలయంతో వదిలేశాడన్న భావం వస్తే, తనపట్ల నిష్కారణంగానే ద్వేషం పెంచుకునే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఆపిల్ల తన కూతురని చెప్పలేదు. తన స్నేహితుల పిల్లఅనీ, తండ్రి ముందే పోయినాడనీ, తల్లి పుట్టగానే పోయిందనీ వాళ్ళకు తెలిపి, తను తరచూవచ్చి చూస్తుంటానని అన్నాడు.

పిల్లను అక్కడ దించేసి వచ్చాక, గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. తన కేదో శాపం ఉంది. లేకపోతే, ఎంత

రేమిలో ఉన్నవాళ్ళకయినా లభించే తోడూనీడా తనకు కరువవటంలో కారణం కనిపించటం లేదు. అన్నపూర్ణతో తను కల్సిమెల్సి ఉండ లేదు. ఎందుకో ఆమెను తన సాదాల దగ్గిరే ఉంచాలని ప్రయత్నించాడు. అంచేత ఆమె నిస్పృహచెంది, వెళ్ళి పోయింది. రజియాను హృదయానికి హత్తుకోవాలనుకున్నాడు. ఆమె ఆనందరావును తన కాళ్ళదగ్గిర కట్టి పడేసుకుందేతప్ప, ఆయన్ను మనస్ఫూర్తిగా మెచ్చి దగ్గరకు వచ్చిం దెప్పుడూలేదు.




ఏది ఏమైతేనేం ఆనందరావుకు మళ్ళీ నిరాశే మిగిలింది. ఆ నిరాశ బ్రతుకంతా ఆవహించింది. చేస్తున్న వ్యాపారంపట్ల శ్రద్ధలేదు. షాపులోకి వస్తున్న ఆడవాళ్ళంతా అన్నపూర్ణగానో, రజియాగానో కనిపించేవారు. కౌంటర్‌లో కూర్చుని డబ్బు తీసుకుంటూ, అయిదు ఇవ్వవల్సిన వాళ్ళకు పది ఇచ్చేవాడు. తర్వాత తప్పు గ్రహించినా, పోస్లే ఆమె తన అన్నపూర్ణలాంటిదే గదా అనుకుని తృప్తిపడేవాడు.

యజమాని నిర్లక్ష్యవైఖరి పనివాళ్లకు పది ఏనుగుల బలాన్ని ఇస్తుంది. ఇదే అదను కనిపెట్టి ఎవడి శక్తిమేరకు వాడు జాగర్తపడటం మొదలుపెట్టాడు. వాళ్లని పనిలోనుంచి తీసేస్తే మునుగుతున్న పడవలోనుంచి బయటపడటానికి ప్రయత్నించినట్లు, ఎవడిమటుకు వాడు తిరిగి చూడకుండా వెళ్ళిపోయినారు. కొత్తగా వచ్చినవాళ్ళు, పాతవాళ్లకన్నా రెండాకులు ఎక్కువే చదివారు.

రెండు రోజులు జ్వరంతగిలి ఆనందరావు ఇల్లు కదల్లేదు. మూడో రోజు రాత్రి దుకాణాన్ని ఎవరో దోచేశారు. అవశేషాలు మినహా మరేం మిగల్లేదు.

పిడుగుపాటుకు కృంగిపోయిన మనిషిలా అయిపోయినాడు ఆనందరావు. చుట్టూఉన్న ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. ఇంత మందిలో తనకు నమ్మదగ్గ మనిషి ఒక్కడయినా కనిపించలేదు.

మరికొన్నాళ్ళు, కాదు కొన్నేళ్ళు తనచుట్టూ గిరిగీసుకుని ఆ గిరిలో ఉండి పోయినాడు. అడపాదడపా అనాథ శరణాలయానికి వెళ్ళి ఆ పిల్లను చూసి వస్తుండేవాడు. ఆ పిల్లకు పద్మజ అని పేరు పెట్టారు వాళ్ళు.

పద్మజ పైడిబొమ్మలా తయారైంది. లంగా, వోణీ వేసుకుని, రెండు జడలు అల్లుకుని, రిబ్బన్లు కట్టుకుని రబ్బరు బొమ్మలాతిరుగుతుండేది. ఆనందరావును చూడగానే ఆ పిల్ల ముహం పుచ్చ పువ్వులా విచ్చుకునేది. ఉన్నకాసేపూ 'అంకుల్, అంకుల్' అంటూ వసపిట్టలా వాగుతుండేది. మొదట్లో దానినోటివెంట 'అంకుల్' అన్న పిలుపు విన్నప్పుడు మనసులో ఏదో ముల్లు గుచ్చుకుని కలుక్కుమన్నా, తర్వాత అలవాటై పోయింది.


విసుగు, విరామ మెరుగని ఈ సంజ కెంజాయలవంక చూస్తూను, ఉదయ రాగాలను వింటూనూ, తన యవ్వనాన్ని పోగొట్టుకున్నాడు ఆనందరావు ఇప్పుడు ఆనాటి బలమూ లేదు, ధనమూ లేదు. బక్కచిక్కిన మనిషి జరామరణాలచేత చిక్కబోతున్నానని ముందుగానే గ్రహించాడు. ఈ జీవన సంధ్యలో త్వరపడి ఓ చిరుదీపాన్ని వెలిగించు కోవాలని ఆశపడ్డాడు.

పద్మజ దగ్గరకువెళ్ళి తనతో వస్తావా అని అడిగితే, ఆ జైలుగోడల మధ్య నుంచి బయటపడటమెలాగా అని ఎదురు చూస్తున్న ఆ పిల్ల, ఎగిరి గంతేసింది.

మళ్ళీ మొదటి కొచ్చాడు. పద్మజను తీసుకుని తను ఆనాడు అన్నపూర్ణ కోసం కొన్న తోటలోకి వచ్చాడు. తోటనయినా, జీవితబాటనయినా మనం ఎప్పటికప్పుడు బాగుచేసుకుంటూ పోవాలనీ, లేకపోతే మన నీడను చూసి మనమే భయపడాల్సివస్తుందని, అక్కడికి వచ్చాక తెల్సుకున్నాడు ఆనందరావు.

చాలా సంవత్సరాల తర్వాత మళ్ళీ ఆ ఇంట్లో దీపం వెలిగింది. నిర్మానుష్య మైన ఆ అడవిలో తిరుగుతున్న పద్మజ రెక్కలు విచ్చుకున్న తూనీగలా కనిపించింది ఆనందరావుకు.

పద్మజకు మాత్రం పెనంమీదనుంచి గెంతి పొయ్యిలో పడ్డట్లుగా ఉంది. అక్కడే నయం ఏదో విధంగా తోటి వాళ్ళతో కాస్త కాలక్షేపం అయ్యేది.




ఇక్కడ పిలిచినా పలకని ఆనందరావు, పిలవకుండానే పలికే గుడ్లగూబలూ, గబ్బిలాలు...

ఈ అవసానదశలో అన్నపూర్ణకు జరిగిన అన్యాయాన్ని గురించే అమితంగా బాధపడజొచ్చాడు ఆనందరావు. జరిగిన తప్పు ఒప్పుకుని, ఆమెను తెచ్చుకోవాలని గూడా ఉబలాటపడ్డాడు. విచారించగా, ఫలానాచోట వంటమనిషిగా బ్రతుకు తోందని తెల్సి, ఆమెకు కబురు చేశాడు ఆనందరావు.

అన్నపూర్ణ రాలేదు. బహుశా అభిమానం అడ్డుతగిలి ఉంటుంది. కొడుకును పంపింది. మురళిని చూసిన ఆనందరావుకు కళ్ళు చెమ్మగిల్లాయి. ఈనాడు చెట్టంత ఎదిగిన వీడేనా, ఆ నాడు తనను ఎత్తుకొమ్మని చేతులు చాస్తూ, తనవెంట తిరిగిన పసివాడు! ఈ పుట్టటం, పెరగటం, గిట్టటం, ఎంత చిత్రమైన ఆట!

పద్మజను పరిచయం చేశాడు. నాలుగు రోజులపాటు ఇద్దర్నీ కన్నుల పండగగా చూసుకున్నాడు. అన్నపూర్ణ గూడా వస్తే బావుండును!

మిగిలిన కొద్దిపాటి డబ్బు, ఆనందరావు కొడుకుపేర బ్యాంకులో వేశాడు. ఈ తోట గూడా వాడిపేరనే రాసి రిజిస్టరు చేశాడు. అంతా అయిన తర్వాత కొడుకొను ఒకే ఒక్క కోరిక కోరాడు.

"ఈ ఆస్తితోపాటు, పద్మజ బాధ్యత గూడా నీకు అప్పగిస్తున్నాను. దాన్ని గౌరవంగా ఒక ఇంటికి సాగనంపే బాధ్యత నీ మీదే ఉందిసుమా" అని గుర్తుచేశాడు.

మురళి మౌనంగానే తలఊపాడు. ఈ పాపిష్టి డబ్బు మూలంగా నే మనుష్యులు విడిపోతారు. వీళ్లమీద ఆ నీడ పడగూడదు. ఆలోచనలు రానివ్వ గూడదని హితబోధచేస్తూ వచ్చాడు ఆనందరావు.

తను ఎన్ని చెప్పినా, పద్మజగురించి మురళి ఆలోచించకుండా ఉండడు. తనకు రావల్సిన ఆస్తిలో, ఈ పిల్లకు కొంత వెళ్తుంది అన్న భావన రాగానే, పద్మజమీద వాడికి నిష్కారణంగా కోపం వస్తుంది. దాన్ని నివారించటానికే ఉన్నదంతా మురళి చేతిలో పెట్టవల్సి వచ్చింది. ఇకపోతే పద్మజ భవిష్యత్తు గురించిన బెంగలేదు. లక్ష్మికళ దాని ముహాన ఉట్టిపడుతుంది. ఎవరైనా కళ్ళ కద్దుకుని చేసుకుంటారు—అని తన డైరీలో మనసులోని మాటలు రాసుకున్నాడు.

ఈ జీవితానికి ఈ ముగింపు కలిగించి నందుకు దేవుడికి మొక్కుకున్నాడు. తీరా దేవుడికి మొక్కుకుని ఇంటికి వచ్చిన మరుక్షణంలో చూసిన సన్నివేశానికి, పెనుతుఫానులోని చిగురుటాకులా గజగజా వణికిపోయాడు. భగవంతుడా ఇంత దారుణమైన శిక్ష విధించావా?

నవనాడులూ కృంగిపోయిన ఆనందరావు, మంచం ఎక్కాడు. ఇన్నాళ్లనుంచీ చూపిన పక్షపాతబుద్ధికి శిక్షగా కాబోలు, ఈ పక్షవాతం వచ్చి పడిపొయ్యాడు. కదలలేదు, మెదలలేదు, నోరువిప్పి చెప్పగలిగిన రోజున చెప్పలేదు. ఇప్పుడు చెప్పలేడు వాళ్ళిద్దరూ అన్నా, చెల్లెల్లేనని—

ముసలి ఎద్దులా, జాలిగా చూస్తూ, కన్నీళ్ళు కారుస్తున్నాడు. ముహాన వర్షం నీరుపడి, కన్నీటి చారికలతో కల్సిపోయి, మళ్ళీ గాలికీ, ఎండకీ ఎండిపోయింది.

రాత్రినుంచీ పద్మజగాని, మురళిగాని ఉన్న అలికిడి ఎక్కడా లేదు. బహుశాః వాళ్ళిద్దరూకల్సి......తల్చుకున్న కొద్దీ ఆనందరావు గుండె చెరువు అయి పోతోంది.

ఈ చరిత్రకు ఇదా ముగింపు! కట్టుబాట్లు, సాంప్రదాయాలూ మనుష్యుల చేతులకు సంకెళ్లు వేస్తున్నట్లుగా కొందరికి అనిపించవచ్చు. వాటిని ఛేదించుకుని విశృంఖలంగా విహరించాలనీ అనిపించ వచ్చు. కానీ పర్యవసానాలను తట్టుకోగలిగినవాళ్ళెంతమంది?

ఎక్కడ ఏ కరెంటు తీగల్ని ఎలుకలు కొరికాయో, లేక అదీ దైవ నిర్ణయమేమో గాని, చురచురమని మంట రగులు కుంటోంది, డైరీలన్నీ ఉన్న చెక్కపెట్టె వెనకనుంచీ...